క్లుప్తంగా

నేటి నుంచి గ్రామ సభలు

శిరివెళ్ల: మండలంలో ఉపాధి పథకం సామాజిక తనిఖీపై గ్రామ సభలు 28వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. 28న వనికిదిన్నె, 29న చెన్నూరు, మోత్కలపల్లె, యర్రగుంట్ల, వెంకటాపురం, 30న గుండంపాడులలో గ్రామ సభలు జరుగుతాయన్నారు. జనవరి 2న గోవిందపల్లె, బోయలకుంట్ల, గంగవరంలో సభలు ఉంటాయన్నారు. 3వ తేదీన ఏంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీపై బహిరంగ చర్చ జరుగుతుందని ఆయన వివరించారు.

నేటి నుంచి నంది బాలోత్సవాలు



పోస్టర్ విడుదల చేస్తున్న సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని మునిసిపల్ టౌన్ హాల్‌లో నంది విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నంది బాలోత్సవాలు కార్యక్రమాన్ని ఈ నెల 28, 29 తేదీలలో నిర్వహిస్తున్నట్లు నంది విజ్ఞాన కేంద్రం సభ్యులు శంకరయ్య, రామరాజు, మాదాల శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మునిసిపల్ టౌన్ హాల్‌లో నంది బాలోత్సవాల కార్యక్రమాల పోస్టర్ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లోని విద్యార్థులందరూ పాల్గొనాలన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నెలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. సాయంత్రం ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి హాజరవుతారని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు. అదేవిధంగా ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకుంటారన్నారు.

హౌసింగ్ లబ్ధిదారులకు రూ.162.96 కోట్లు చెల్లింపు



రికార్డులు పరిశీలిస్తున్న డీఈ నాగరాజు

చాగలమర్రి: ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో జగనన్న లే అవుట్లలో ఇంటి నిర్మాణాలకు ఇప్పటి వరకు లబ్ధిదారులకు రూ.162.96 కోట్ల బిల్లులు చెల్లించినట్లు హౌసింగ్ డీఈ నాగరాజు తెలిపారు. ఆయన బుధవారం చాగలమర్రిలోని హౌసింగ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రభుత్వం 34 జగనన్న లే అవుట్లు ఏర్పాటు చేసి 3,405 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. సొంత స్థలాలు ఉన్న 3,689 మందికి ప్రభుత్వం పక్కా గృహాలను మంజూరు చేసిందన్నారు. వాటిలో 1,228 గృహాల నిర్మాణాలు పూర్తి కాగా, 1,684 బేస్‌మెంట్, 246 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఏఈ షఫీవుల్లా, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఓబులేసు, సిబ్బంది సలీం తదితరులున్నారు.

గృహాల వివరాల సేకరణ

ఉయ్యాలవాడ : నంద్యాల జమ్మలమడుగు నేషనల్ హైవే రోడ్డు విస్తరణలో కోల్పోయిన గృహాలు, స్థలాలు వివరాలను బుధవారం ఆర్‌అండ్‌బీ అధికారులు సేకరిస్తున్నారు. గృహాలు, స్థలాలకు సంబంధించి కొలతలు వేస్తున్నారు. జాతీయ రహదారి నిర్వహణ అధికారి(డీఈ) సుధాకర్ ఆధ్వర్యంలో ఏఈ శ్రీహరి బృందం 167కె జాతీయ రహదారి విస్తరణలోని గృహాలు, స్థలాలు, తొలగించాల్సిన వాటికి వేసి విలువ అంచనాలను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ గ్రామ సర్పంచ్ ఆరికట్ల శివరామక్రిష్ణారెడ్డి, న్యాయవాది ఆరికట్ల మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి రహిత రాష్ట్రమే ధ్యేయం

చాగలమర్రి: కుష్టు వ్యాధి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 27 నుంచి జనవరి 12వ తేదీ వరకు కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేపట్టిందని జిల్లా వైద్యారోగ్య శాఖ ఏఓ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం చాగలమర్రిలోని 3వ సచివాలయ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో నిర్వహిస్తున్న సర్వేను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు షేక్ ఇమ్రాన్ మండలంలో సర్వే కార్యక్రమానికి ఏర్పాటు చేసిన ప్రణాళిక రికార్డును పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఎంఓ ప్రసాద్, స్థానిక సిబ్బంది ఉన్నారు.

కుష్టు నివారణకు చర్యలు

ఆళ్లగడ్డ: కుష్టు వ్యాధిని నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా కుష్టు నివారణాధికారి చంద్రశేఖర్ అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో బుధవారం కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 12వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో కుష్టు వ్యాధి గుర్తింపు, అవగాహన కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.

వరి.. రైతన్నకు సిరి

- పాలకుల చొరవ.. అధికారుల చర్యలతో కేసీకి నీరు
- అనుకూలించిన వాతావరణం
- తగ్గిన తెగుళ్ల బెడద
- ఆశించిన దానికన్నా అధికంగా దిగుబడులు
- మార్కెట్‌లో మంచి ధర



వరి ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబోస్తున్న వ్యవసాయ కూలీలు

గోస్పాడు: ఈ ఏడాది రైతులకు వరి పంట సిరులు కురిపిస్తోంది. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని కేసీకి సకాలంలో నీరు వదలడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్‌లో వరి సాగు చేసిన రైతులను లాభాలు వరిస్తున్నాయి. పెట్టుబడి సాయం నుంచి దిగుబడులు అమ్ముకునే వరకు ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుండడంతో వ్యవసాయం పండగలా సాగుతోంది. వర్షాభావ పరిస్థితులున్నప్పటికీ వాతావరణం అనుకూలించడంతో తెగుళ్ల తగ్గి ఆశించిన దానికన్నా అధికంగా దిగుబడి రావడం, మార్కెట్లో మంచి ధర పలుకుతుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన పెట్టుబడి ఖర్చులు

మండలంలో ప్రతి ఏటా కేసీ కింద వరి సాగు చేస్తున్నారు. సాధారణ విస్తీర్ణం 4,742 హెక్టార్లు కాగా 3,021 హెక్టార్లలో వరి పైరు సాగు చేశారు. మండలంలో సాంబవరం, దీబగుంట్ల, కానాల పల్లె, జిల్లెల్ల నెహ్రూనగర్, ఎస్ నాగులవరం, ఎం చింతకుంట్ల, జూలేపల్లె, పసురుపాడు, యాళ్లూరు, గోస్పాడు తదితర గ్రామాల్లో వరి పంట వేశారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు సాగు మొదట్లో కొంత ఇబ్బందులకు గురయ్యారు. అయితే పాలకుల చొరవ, అధికారులు తీసుకున్న చర్యలతో కేసీ కాలువకు నీరు వదలడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే విత్తనం నాటిన దగ్గరి నుండి పైరును కుప్పలూడ్చి ధాన్యం ఇంటికిచేర్చేవరకు యంత్రాల వినియోగం పెరిగిపోయింది. ఫలితంగా సమయం, డబ్బు ఆదా అయ్యాయి. ఖరీఫ్ సీజన్‌లో వాతావరణ పరిస్థితులు అనుకూలించి, తెగుళ్ల, చీడపీడల బెడద తగ్గడంతో పెట్టుబడి ఖర్చులూ తగ్గాయి.

ఊరటనిస్తున్న ధర...

ప్రస్తుతం పంటకాలం పూర్తయ్యి రైతులు జోరుగా వరి కోతలు చేసి నూర్పిడి చేస్తున్నారు. ముందస్తుగా సాగు చేసిన రైతులు వరిధాన్యాన్ని ఇళ్లకు తరలించగా మరికొందరు కోతలు కోసి నూర్పిల్లు చేసి ధాన్యాన్ని ఆరబోసే పనిలో ఉన్నారు. ఎకరాకు 35 నుంచి 45 బస్తాల వరకు దిగుబడి వస్తోంది. అలాగే ధర కూడా రైతన్న ఊహించని విధంగా లభిస్తోంది. ప్రస్తుతం నంద్యాల సోనా రకం 75 కేజీల బస్తా రూ. 2500 నుంచి రూ.2800 వరకు, కర్నూలు సోనా రూ.2200 నుంచి 2,400 వరకు ధర పలుకుతుంది. వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు.



ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న దృశ్యం



వరి కోత కోస్తున్న మిషన్

వరికి ధర బాగుంది...



ఈ ఏడాది మొదట్లో వరి పైరు సాగుకు కొంత ఇబ్బంధులు పడ్డాం. అయితే వర్షాలు లేకపోయినా సకాలంలో కేసీకి నీరు రావడంతో పైర్లు రక్షించుకోగలిగాం. గతంలోలాగా కాకుండా పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గి పైరు చేతికి వచ్చింది. బస్తా ధర రూ.2400 దాకా ఉండడంతో కొంత మేరకు లాభసాటిగా మారింది.

– లక్క కుమార్‌రాజ, రైతు, జిల్లెల్ల

ఎకరాకు 40 బస్తాల దిగుబడి



నాలుగెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వరి పైరు సాగు చేశా. ఈ ఏడాది దిగుబడి బాగా రావడంతో పాటు మంచి ధర కూడా ఉంది. ప్రతి ఏడాది వరి సాగులో తెగుళ్ల చీడ, పీడల నివారణకు పెట్టుబడులకు అధికంగా ఖర్చయ్యేవి. ఈ ఏడాది ఆ కష్టాలు లేవు. పెట్టిన పెట్టుబడులు పోను ఆర్థికంగా నిలదొక్కుకునేలా దిగుబడులు ఉన్నాయి.

– శేఖర్, రైతు, గోస్పాడు

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రవి చంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చైర్ పర్సన్ మాబున్నీసా అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

భక్తే మోక్షానికి మార్గం

నంద్యాల(వ్యవసాయం): భగవంతునికి దగ్గరయ్యే మార్గమే భక్తి అని తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు అన్నారు. బుధవారం ధనుర్మాసాన్ని పురస్కరించుకుని టీటీడీ దివ్య ప్రబంధ ప్రాజెక్టు, నంది రైతు సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుప్పావై ప్రవచనాలను 11వ రోజు భక్తులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ గోదాదేవి గోపికలను నిద్రలేపుతూ భగవంతున్ని ఒక నాయకుడిగా భావించి ఆయనకు భక్తి, జ్ఞానం సౌందర్యం తదితర వాటిని అర్పిస్తే మోక్ష మార్గాన్ని ఇస్తారన్నారు.

లెప్రసీ సర్వే ప్రారంభం

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరులో బుధవారం పీహెచ్‌సీ వైద్యాధికారి, లెప్రసీ విభాగం జిల్లా అధికారి చంద్రశేఖర్ ఎల్‌సీడీసీ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో లెప్రసీ కేసుల నివారణ కోసం సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ఇంటింటికీ తిరిగి సర్వే చేయిస్తున్నామని, అనుమానం ఉన్న వారిని గుర్తించి వైద్య పరీక్షలకు సిఫారసు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చెప్పింది చేశాం.. మీ ముందుకు వస్తున్నాం

- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల వర్తింపు
- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



కొండాపురంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

దొర్నిపాడు: తాము ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వందశాతం నెరవేర్చాం...అందుకే మీ ముంగిటకు ధైర్యంగా వన్నామని... ఇంకా ఏవైనా సమస్యలున్నా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. మండల పరిధిలోని కొండాపురం సచివాలయ పరిధిలోని అర్జునాపురం, అమ్మిరెడ్డి నగరం, కొండాపురం, భాగ్యనగరం గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే గంగుల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజలతో మాట్లాడి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించిన గంగుల సమస్యలపై ఆరా తీశారు. అదేవిధంగా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ ఈ సచివాలయ పరిధిలోని నాలుగు గ్రామాలకు సంబంధించి ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.17కోట్లు, అభివృద్ధికి రూ.8.60కోట్లు చొప్పున మొత్తం రూ. 25.60కోట్లు ఖర్చు చేశామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో మండలం మొత్తానికి కూడా ఈ మొత్తం ఖర్చు చేయలేదని, మా జగనన్న ప్రభుత్వం కేవలం ఒక్క ఊరికే వెచ్చించిందని గుర్తు చేశారు. టీడీపీ నాయకులు భవిష్యత్‌కు గ్యారెంటీ అని తిరుగుతున్నారని... ముందు సీటు ఎవ్వరికి గ్యారెంటో చెప్పుకోలేని దుస్థితి నెలకొందని గంగుల ఎద్దేవా చేశారు. చంద్రబాబు మాయమాటలను నమ్మేపరిస్థితి లేదని, గతంలో మభ్యపెట్టిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు. ప్రజలకు, గ్రామాలకు చెసిన మేలును ప్రతి సచివాలయంలో అందరూ చూసుకునేలా డిస్ప్లే బోర్డుల్లో పొందుపరిచిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్కుమాధవీ, పయిడేల మాధవీలత, ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ శీలం పార్వతి, జేసీఎస్ కన్వీనర్ శివారెడ్డి, నాయకులు లక్కు చంద్రశేఖర్‌రెడ్డి, పయిడేల శివరామిరెడ్డి, డీలర్ శివుడు, మోహన్‌నాయుడు, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్రీపతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

టీడీపీ మునిగిపోయిన పడవ

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- 20వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

నంద్యాల(సిటీ): టీడీపీ మునిగిపోయిన పడవ అని, ఎంత మంది వచ్చినా దాన్ని ఒడ్డుకు చేర్చలేరని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. నంద్యాల టీడీపీ నాయకులు తాము అధికారంలోకి వస్తే అదిచేస్తాం, ఇది చేస్తామంటూ ప్రజలకు ఉత్తుత్తి హామీలు ఇస్తున్నారని, గతంలో రెండు సార్లు మంత్రిగా ఉండి నంద్యాలకు ఏం ఒరగబెట్టారో చెప్పాలన్నారు. పట్టణంలోని 20వ వార్డులో మునిసిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా, వైస్ చైర్మన్ పాంషావలి, వార్డు కౌన్సిలర్ మురళిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ప్రజల సమస్యలను తెలుసుకుని, కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు.

ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే 'గడప గడపకు'

సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలు తెలుసుకోవడానికి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దాదాపు 95 శాతం పూర్తయిందని ఎమ్మెల్యే శిల్పా రవి అన్నారు. ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టని టీడీపీ నాయకులకు నంద్యాల ప్రజలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. నంద్యాలలో రాజకీయం మొదలు పెట్టినప్పటి నుంచి శిల్పా సేవా సమితి ద్వారా ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో నంద్యాలలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ ఆంజనేయులు, బెస్తసంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, దేశం సుధాకర్‌రెడ్డి, నాయకులు రామచంద్రుడు, సుంకన్న, ఎస్టీ సెల్ జనరల్ సెక్రెటరీ సుంకన్న, శేఖర్, బాబు, తిరుపాలు, శివయ్య, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంత మార్కెట్ అభివృద్ధి పనుల పరిశీలన



మార్కెట్ కమిటీ సభ్యులతో నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులోని సంతమార్కెట్‌లో జరుతున్న అభివృద్ధి పనులను నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డు నుంచి రూ.15లక్షలు, పంచాయతీ నుంచి రూ.10 లక్షల వ్యవయంతో రేకుల షెడ్లు, ఆఫీస్ రూం, కాంపౌండ్, మరుగుదొడ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి, పరమేశ్వరి ఎడ్యుకషనల్ సొసైటీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు దేవికామణి, శివరామిరెడ్డి, మార్కెట్ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, లక్ష్మికాంత్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగర్జున తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు భాగ్యనగరం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం ఉన్నత పాఠశాలకు చెందిన సమీర, రాముడులు తైక్వాండోలో ప్రతిభ చూపారు. డిసెంబర్ 29 నుంచి 2024 జనవరి 4వరకు మధ్యప్రదేశ్‌లోని ఖేతల్‌లో నిర్వహించే 67 జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొననున్నారు. ఇటీవల రైల్వేకోడూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు ప్రతిభ చూపి బంగారు పతాకాలను కైవసం చేసుకున్నారు. ఈసందర్భంగా బుధవారం పీడీ శ్రీధర్, విద్యార్థులను ఎంఈఓ రామచంద్రయ్య, హెచ్‌ఎం ఆదిలక్ష్మమ్మ అభినందించారు.

జనవరి 6 నుంచి కేపీఎల్

నంద్యాల: ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు శ్రీశైలం నియోజక వర్గంలో అన్ని మండలాలలో కార్తీక్ ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) పోటీలను జనవరి 6వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు శ్రీశైలం నియోజక వర్గం వైఎస్సార్‌సీపీ నేత శిల్పా కార్తిక్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని పద్మావతి నగర్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర క్రీడలు రాష్ట్రంలో ఒక పండుగలా జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి యువకుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు, వారిలోదాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాపోటీలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. జగనన్న స్ఫూర్తితో శ్రీశైలం నియోజకవర్గంలో అన్ని మండలాల పరిధిలో ప్రతిభక లిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కార్తీక్ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్నామన్నారు. క్రికెట్, కబడ్డీ, బాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్‌లు పోటీలు ఉంటాయని, విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలను అందజేస్తామన్నారు. క్రికెట్ తప్ప మిగతా పోటీలలో మహిళలు పాల్గొనవచ్చని తెలిపారు. అనంతరం క్రికెట్ కిట్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీయల్ డైరెక్టర్ డాక్టర్ శశికళ రెడ్డి, మహానంది దేవస్థాన చైర్మన్ మహేశ్వరరెడ్డి, బండిఆత్మకూరు మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, బండి ఆత్మకూరు, మహానంది వైఎస్సార్‌సీపీ నాయకులు, పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

నంద్యాల(అర్బన్): ఎన్‌హెచ్ 167కే కల్వకుర్తి – నంద్యాల జాతీయ రహదారిలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని నంద్యాల మండలం బిల్లలాపురం, పెద్దకొట్టాల, కొత్తపల్లె గ్రామల రైతులు కోరారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందించారు. పెద్దకొట్టాల మాజీ సర్పంచ్ జయపాపిరెడ్డి మాట్లాడుతూ.. నంద్యాల పట్టణానికి కేవలం రెండు, మూడు కిలో మీటర్ల దూరంలో రైతులకు సంభందించిన విలువైన భూములు రహదారి నిర్మాణంలో పోతున్నాయని, బయట మార్కెట్‌లో ఎకరం భూమి రూ. 2 కోట్ల నుంచి రూ. 5 కోట్ల వరకు విలువ చేస్తుందని, ప్రభుత్వం మాత్రం ఎకరాకు రూ.3 నుంచి రూ.6 లక్షల రూపాలు నష్టపరిహారం అందిస్తున్నట్లు నోటీసులు ఇవ్వడం తగదన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు తగిన చర్యలు తీసుకుని రైతులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బిల్లలాపురం శ్రీరాములు, మహేష్ నాయుడు, మోహన్ కృష్ణ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని బి.నాగిరెడ్డిపల్లె మెట్ట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీరంగాపురం గ్రామ సచివాలయ ఉద్యోగి రాజశేఖర్‌రెడ్డి, అదే గ్రామానికి చెందిన ప్రదీప్ మోటార్ సైకిల్‌పై ఎర్రగుడిదిన్నె వైపు వెళ్తున్నారు. బి.నాగిరెడ్డిపల్లె మెట్ట వద్ద మలుపు తిరుగుతూ మోటార్ సైకిల్ అదుపు తప్పి అదే సమయంలో బస్సు దిగి గ్రామంలోకి నడిచి వెళ్తున్న వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని ఢీ కొట్టి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయ పడ్డారు. స్థానికులు క్షత గాత్రులను 108లో నంద్యాల ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు.

వేతనాలు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచాలని కోరుతూ బుధవారం నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం తోటమద్దులు, జిల్లా కార్యదర్శి నిర్మల, ప్రాజెక్ట్ కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మునగాల సర్పంచ్ లోకేశ్వరరెడ్డి



నాగులవరంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి

నంద్యాల(అర్బన్): నంద్యాల మండల గ్రామాల్లోని సచివాలయాల పరిధిలో రెండో రోజు నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డి పోటీల్లో జట్లు నువ్వా నేనా అన్న రీతిలో తలపడుతున్నాయి. మునగాల గ్రామంలో నిర్వహించిన క్రీడాపోటీలను గ్రామ సర్పంచ్ లోకేశ్వరరెడ్డి ప్రారంభించారు. చాపిరేవులలో ఎంపీడీఓ సుగుణ శ్రీ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. అదేవిధంగా మిగిలిన 15 గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి.

ఆడుదాం ఆంధ్రకు విశేష స్పందన

గోస్పాడు: గ్రామాల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలకు విశేష స్పందన వస్తోంది. మండలంలోని దీబగుంట్ల, యాళ్లూరు, గోస్పాడు లోని క్రీడా మైదానాలలో ఆటల పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ అనసూయ, తహసీల్దార్ విజయ్ శేఖర్, ఎంఈఓ అబ్దుల్ కరీం, పంచాయతీ సిబ్బంది, పాఠశాలల పీఈటీల ఆధ్వర్యంలో క్రీడాపోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా దీబగుంట్లలో కబడ్డీ, వాలీబాల్, యాళ్లూరులో క్రికెట్, గోస్పాడులో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీలు తిలకించేందుకు క్రీడా మైదానాల వద్ద ప్రజలు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నంద్యాల (సిటీ): క్రీడలతో మానసికోల్లాసంతో పాటు ఒత్తిడిని దూరమవుతుందని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి, డీఈఈ మధుకుమార్ అన్నారు. బుధవారం మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించారు. ఎస్పీజీ మైదానంలో కో ఆప్షన్ సభ్యురాలు శోభారాణి, దెవనగర్ బాషా, కారు రవికుమార్ పాల్గొనగా, పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో 12వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గోపాల్ రెడ్డి, కౌన్సిలర్ శ్యామ్ సుందర్ లాల్, 14వ వార్డు ఇన్‌చార్జ్ కాల్వ నాగరాజు తదితరులు పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు.

క్రీడలకు పూర్వ వైభవం

రుద్రవరం: గ్రామీణ క్రీడలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రాతో పూర్వ వైభవం తీసుకు వచ్చారని ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో క్రికెట్, వాలీ బాల్, కబడ్డీ, ఖో–ఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ ఆటల పోటీలు సాగాయి. ఆర్.నాగులవరంలో చైర్మన్, ఎంపీడీఓ మధుసూదనరెడ్డి, తహసీల్దారు రవీంద్రప్రసాదు, ఏఈ వెంకటరాముడు తదితరులు బ్యాడ్మింటన్ పోటీలను ప్రాంభించారు. వారు కొద్దిసేపు ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో టీ.లింగదిన్నె మాజీ సర్పంచు ఎర్రన్న, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, కార్యదర్శులు ఓబులేసు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

ఉయ్యాలవాడ : ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా రెండవ రోజు బుధవారం ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో మూడు జట్లు పాల్గొన్నాయి. విజయసింహారెడ్డి జట్టు విజయం సాధించింది. గ్రామ సర్పంచ్ మేకల ఓబులేస్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి

ఉయ్యాలవాడ : ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏఓ రాజేంద్రకుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని సర్వాయిపల్లె, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామ సర్పంచ్‌లు సరాబు ఉమ, ప్రసాద్ అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి పెట్టాలన్నారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.